



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు. బుధవారం స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు బాగా జరిగిందని, పనుల కల్పన, మెటీరియల్ కాంపొనెంట్ ఖర్చులో 99 శాతం లక్ష్యాలను సాధించామన్నారు. కూలీలకు సగటు వేతనం రూ.286 ఇచ్చి రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉన్నామని, ఎంపిడిఒలు, ఎపిఒలు, డ్వామా సిబ్బంది, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులను అభినందించారు. ఏప్రిల్, మే, జూన్ లో వ్యవసాయ పనులు ఉండవని ఉపాధి హామీ కింద ఈ సమయంలో ఎక్కువగా పనులు కల్పిస్తే కూలీలకు ప్రయోజనం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నెలల్లో ముమ్మరంగా పనులు కల్పించి నిర్దేశించిన లక్ష్యంలో 90 శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వేసవి లో ఫార్మ్ ఫాండ్లు, పశువుల నీటి తొట్ల నిర్మాణాలు, చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ పనులు రైతులకు, ప్రజలకు ఎంతగానో ఉపయోగకరమైన పనులని, పశువుల నీటి తొట్ల నిర్మాణాలు ఎండా కాలంలో పశు, పక్ష్యాదుల దాహార్తి తీర్చేందుకు ఉపయోగపడే మంచి కార్యక్రమమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 8 వేల 500 ఫార్మ్ ఫాండ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 5661 నిర్మాణాలకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ఇందులో 1268 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, 437 పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఆదోని, పెద్దకడుబూరు, సి.బెళగల్ , కౌతాళం, మంత్రాలయం, హోళగుంద మండలాలలో ఇంకా శాంక్షన్ లు ఎందుకు పెండింగ్ ఉన్నాయని కలెక్టర్ ఎంపిడిఒలను ప్రశ్నించారు. జూన్ నాటికి ఫారంపాండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్తుంటే, ఇంకా శాంక్షన్ లు కూడా తీసుకోకపోతే ఎలా అని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం మొదలయ్యేలోపు ఫార్మ్‌పాండ్స్ నిర్మాణాలు కచ్చితంగా పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే పంచాయతీ నిధులతో చేయాలని, అంతకుమించి అయితే మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో రిపేర్లు చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పత్రికల్లో వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ, ఆయా మండలాల్లో తాగునీటి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

సమస్యలను పరిష్కరించారా అని ఎంపిడిఒలను , ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఆరా తీశారు. తాగునీటి సమస్యలు రాకుండా డిపిఒ, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఇఒఆర్‌డిలు, పంచాయతీ సెక్రటరీలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు..స్పెషల్ ఆఫీసర్లు కూడా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేసిన వెంటనే సర్టిఫికేట్ పంపాలని తహసీల్దార్లను ఆదేశించారు. మద్దికెర, సి.బెళగల్ మండలాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ఇంకా పెండింగ్ ఉందని, పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తికొండ, కృష్ణగిరి మండలాలలో వెక్టరైజేషన్ ఇంకా పెండింగులో ఉందని, పూర్తి చేసి ఉంటే గూగుల్ షీట్‌లో అప్లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ వెంకట నారాయణమ్మ, డ్వామా పిడి వెంకట రమణయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ నాగేశ్వరరావు, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెట్ ల్యాండ్ నివేదిక అందచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో గుర్తించిన వెట్ ల్యాండ్‌లపై నివేదిక అందచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వెట్ ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 333 వెట్ ల్యాండ్స్ ఉన్నట్లు స్పేస్ అప్లికేషన్ సెంటర్ అట్లాస్ గుర్తించిందని, ఆ మేరకు భూముల సరిహద్దులతో పాటు గ్రౌండ్ ట్రూతింగ్ తదితర వివరాలతో వారం లోపు నివేదిక సమర్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ , సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వెట్ ల్యాండ్ కమిటీ సభ్యులు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఎఫ్ఒ శ్యామల, ఇరిగేషన్ ఎస్ఇ ద్వారకనాథ్ రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వర రావు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి ,జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, కర్నూలు అడిషనల్ మున్సిపల్ కమిషనర్ కృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ ఇఇ కిషోర్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి విజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

మున్సిపల్ ఇంజనీరింగ్

కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆప్కాస్ రద్దుచేసి పొరుగు సేవల సిబ్బందిని ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలని 26, 27, 30వ వార్డులో కల్లూరు అర్బన్ ప్రాంతం నగర కమిటీ నాయకులు జి.యేసు రాజు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యేసు మాట్లాడుతూ ప్రజారోగ్యం , పర్యావరణ, పరిరక్షణ, పట్టణాల పరిశుభ్రత కొరకు విషవాయువుల మధ్య వీధుల్లో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందని అన్నారు. అందుకోసం జరుగుతున్న పోరాటంలో మున్సిపల్ కార్మికులంతా కలిసి రావాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 2025 మార్చి 6న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దుచేసి పొరుగు సేవల సిబ్బంది నియామకాలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని తీర్మానించినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. ఈ వార్త మునిసిపల్ కార్మికులను తీవ్ర ఆందోళన గురిచేస్తుందని అన్నారు. ఈ స్థితిలో ప్రైవేట్ ఏజెన్సీల వలయాలలో చిక్కుకుపోకుండా తమ హక్కులను కాపాడుకునేందుకు మున్సిపల్ కార్మికులు పోరాటం తప్ప మరో మార్గం లేదని అన్నారు. ఈ సంతకాల సేకరణ దశల వారి పోరాటాల్లో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గంగయ్య, చౌడయ్య, పరమేష్, అమీర్‌బాష, శ్రీనివాసులు, శివ, కె. మద్దిలేటి, పి.కృష్ణ, లక్ష్మీదేవి, సుగుణమ్మ, జె వెంకటేశ్వర్లు, రాముడు, మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ సెంటర్‌ను సందర్శించిన డిఎంహెచ్‌ఒ

- స్కానింగ్ గది తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ పి.శాంతికళ బుధవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కర్నూలుస్టేట్ కాన్సర్ సెంటర్‌ను సందర్శించారు. పీసీ అండ్ పిఎన్‌డిటి కొత్త రిజిస్ట్రేషన్‌లో భాగంగా స్కానింగ్ గదిని తనిఖీ చేసి స్కానింగ్ మెషిన్ కు సంబందించిన పత్రాలు, వైద్యుల సర్టిఫికేట్లను పరిశీలించారు. అక్కడే ఉన్న ప్రివెంటివ్ ఆన్కాలజి విభాగాన్ని సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్‌సిడి 3.0 స్క్రీనింగ్ జరుగుచున్నదని ఈ స్క్రీనింగ్‌లో 18 ఏళ్ల పైబడిన వారందరికీ గ్రామీణ ప్రాంతంలో ఒక ఎంఎల్‌హెచ్‌పి/ హెచ్‌పి /సిహెచ్‌ఒ, ఎఎన్ఎం, ఆశా, పట్టణ ప్రాంతంలో స్టాఫ్ నర్సు, ఎఎన్ఎం, ఆశాలు కలిపిన బృందం , గృహ సర్వే నిర్వహిస్తుందని అన్నారు. ఈ స్క్రీనింగ్ ప్రతి వారం 5 రోజులు (సోమవారం నుండి శుక్రవారం) జరుగుతుందన్నారు. ముఖ్యంగా మౌఖిక, రొమ్ము సర్వికల్ క్యాన్సర్ల కొరకు స్క్రీనింగ్ చేస్తారన్నారు. అనుమానిత కేసులను ప్రాథమిక / పట్టణ ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్‌కు పంపిస్తారన్నారు. వారు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కర్నూలులో స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి వారంలో రెండు రోజులు (మంగళవారం గురువారం) రెఫెర్ చేస్తారని తెలిపారు. అక్కడకి వచ్చిన అనుమానిత కేసులను స్పెసలిస్ట్ వైద్యులచే పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ అయిన కేసులకు అవసరమైన చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ , రేడియాలజిస్ట్ డాక్టర్ దిలీప్ కుమార్, డెమో శ్రీనివాసులు శెట్టి , కార్యాలయ పరిపాలనాధికారి శ్రీనివాసులు , డిప్యూటీ డెమో చంద్రశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందం పేరుతో పార్కులు అవసరం లేదు

- నదులను ఆక్రమణల నుండి కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అందం పేరుతో పార్కులను నిర్మిస్తామంటున్న మున్సిపల్ సిబ్బంది ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టి నిర్మించవద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి ఆనంద్ బాబు అన్నారు. బుధవారం ఆనంద్ థియేటర్ ఎదురుగా, కెఇ. మాదన్న నగర్ పక్కన హంద్రీ నదిని ఆక్రమించి నిర్మిస్తున్న పార్కును సిపిఎం యువ నాయకులు అబ్దుల్లా, రంగప్ప, నాగరాజు, అమర్, మధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడుతూ నదులు, వాగులు, వంకలు, కాలువలు మురుగు కూపాలుగా మారకుండా వాటిని శుభ్రపరిచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, హంద్రీ నదిని ఆక్రమించి కోట్లు ఖర్చుపెట్టి పార్కును నిర్మించాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడపడితే అక్కడ వాగులు, వంకలు, నదులు కబ్జాలకు గురై అవి పొంగి పొర్లినప్పుడు ప్రజల ఆస్తి నష్టానికి, ప్రాణ నష్టానికి దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నదుల ప్రమాదం నుండి ప్రజలను రక్షించడం కోసం కరకట్టలను నిర్మించమంటే.. ఎక్కడికక్కడ ఉన్న నదులను పూడుస్తూ ప్రమాదానికి నిలయాలుగా మారుస్తున్నారన్నారు. ఇప్పటికే నగరంలో అనేక చోట్ల ఉన్న పార్కులు ఆదరణకు నోచుకోక, పట్టించుకునే దిక్కు లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయన్నారు. నదిని పూడ్చి పార్కు నిర్మించడానికి జలవనరుల శాఖ ఎలా అనుమతి ఇచ్చిందో తేల్చాలన్నారు. అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్ల కడుపు నింపడానికే ఇలాంటి పనులు చేస్తున్నారన్నారు. నదుల పక్కన కట్టే కరకట్టలు సైతం డంప్‌తో పూడుస్తున్నారని అవి భవిష్యత్తులో ఎలా నిలబడతాయని ప్రశ్నించారు. ఇలాంటి అక్రమమైన పనిపట్ల జిల్లా ఉన్నతాధి అధికారులు చొరవ తీసుకుని తగు చర్యలు తీసుకోవాలన్నారు.




హంద్రీనదిని పరిశీలిస్తున్న ఎండి ఆనంద్‌బాబు

ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు మండలం, పసుపుల గ్రామంలోని తన స్వగృహంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతులు అందజేస్తున్న ప్రజలు



నిరసన తెలుపుతున్న నాయకులు

గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలి

ప్రజాశక్తి- పత్తికొండ

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరపై రూ.50 పెంచిన ధరలు తగ్గించాలని సిపిఎం పత్తికొండ కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి ,సీనియర్ నాయకులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవన్ నుండి నాలుగు స్తంభాల కూడలి వరకు కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి నాలుగు స్తంభాల దగ్గర రాస్తారోకో చేశారు. రంగారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రూ.450 ఉన్నటువంటి సిలిండర్ ఈరోజు రూ.910 చేరుకుందన్నారు. బిజెపి ప్రభుత్వం నిత్యవసర వస్తువుగా మారిన గ్యాస్ ధరలను పెంచడం దారుణమని, ఇప్పటికే ప్రజలపై కరెంటు చార్జీలు పెంచి భారాలు మోపిందని, ఇప్పుడు గ్యాస్ ధరల నుంచి మరింత భారాలు మోపిందని, వెంటనే పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు తగ్గించకపోతే మరింత ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంగన్న, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కాశన్న, మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, సిపిఎం సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, మాణిక్యం, రంగన్న, రాజేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం కిట్లు సిద్ధం

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

వేసవి సెలవుల తర్వాత పాఠశాలలో 2025 -26వ సంవత్సరం స్కూలు ప్రారంభోత్సవం నాటికి విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లలో భాగంగా ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫాం, ఒక జత షూష్, రెండు జతల సాక్స్, ఒక బెల్టు, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, డిక్షనరీ ఇచ్చేలాగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది .ఏర్పాట్లలో భాగంగా మండల స్థాయిలో మండల స్టాక్ పాయింట్ నుండి మండలంలోని అన్ని పాఠశాలలకు ఈ కిట్లు చేరవేస్తారు. మండల స్టాక్ పాయింట్ గా జివిఆర్ ఉన్నత పాఠశాల కోడుమూరును ఎంపిక చేశారు. దీనిని పురస్కరించుకొని ఏర్పాట్లను పరిశీలనకు రాష్ట్రస్థాయి పర్యవేక్షకులు మాధురి , సిఎంఒ కర్నూల్ వారు బుధవారం జివిఆర్ ఉన్నత పాఠశాలను పర్యవేక్షించి గదులన్నిటిని పరిశీలించి ఏర్పాట్లు చక్కగా ఉన్నాయని సంతృప్తిని వ్యక్తం చేశారు. పర్యవేక్షణలో ఎంఈఓ 1 శ్రీమతి వసంతి లక్ష్మీబాయి ,ఎంఈఓ 2 తైమూరు భాష , సి.ఆర్.ఎం.టిలు భాస్కర్, సుధాకర్, బాషా పాల్గొన్నారు .మండల స్థాయి కిట్ల పంపిణీ కార్యక్రమం %వీజుఉ% 2 అయిన బి తైమూర్ భాష నాయకత్వంలో పంపిణీ చేయబడునని వెల్లడించారు.

20, 21 తేదీల్లో రజక వృత్తి దారుల రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈ నెల 20, 21 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం ఏడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షులు సి. గురు శేఖర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం కర్నూలు కార్మిక కర్షక భవన్ ఐలమ్మ భవన్‌లో జిల్లా అధ్యక్షులు సి. ముక్కన్న అధ్యక్షతన రజకుల సమస్యలపై చర్చా వేదిక నిర్వహించారు. సి. గురు శేఖర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రజక వత్తిదారులు నేటికీ దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, గ్రామ బహిష్కరణలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నివారణకు రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో బీసీ తరగతులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని, 50 సంవత్సరాలు నిండిన రజకులందరికీ వద్ధాప్య పెన్షన్ మంజూరు చేస్తామని, ఆదరణ పథకం-2 ద్వారా వత్తి పరికరాలు అందిస్తామని, రజక అభివద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులను రజకుల అభివద్ధికి ఖర్చు చేస్తామని హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. బీసీ తరగతుల ప్రజలందరి అభివద్ధికి రుణ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ, రజక వత్తిదారుల వత్తి నిర్వహణకు నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రజక ఉద్యోగులు, కార్మికులు, వత్తిదారులు, యువతీ యువకులు, మహిళలు ఐక్యంగా పోరాటం చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయాన్నారు.



మాట్లాడుతున్న నాయకులు సి.గురుశేఖర్

మారెమ్మ దేవర ఉత్సవంలో కిక్కిరిసి జనం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని తిమ్మందొడ్డిలో బుధవారం మారెమ్మ దేవర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గ్రామ పెద్దల, గ్రామస్తుల సమక్షంలో గ్రామ ప్రజలు మారెమ్మ గుడి దగ్గరకు బోనాలతో వెళ్లే ఉత్సవాలలో పోటెత్తిన భక్తుల, బంధువుల, ప్రజలతో గ్రామం కిక్కిరిసి పోయింది. అమ్మవారి గుడి దగ్గర మొక్కులు తీర్చుకొని పుర వీధులకు ఇళ్లకు ఉత్సవ బోనాలు వెళ్లే వరకు సిబెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి తమ పోలీసు సిబ్బందితో గట్టి నిఘా చర్యలు చేపట్టారు. గ్రామంలో ప్రజలకు భక్తులకు తాగునీటి కొరత లేకుండా, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సర్పంచి, కుటుంబం ప్రత్యేక శ్రద్ధ చూపి సౌకర్యాలు కల్పించడంతో హర్షం వ్యక్తం చేశారు.



సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

- మంత్రికి వినతిపత్రం ఇచ్చిన ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తికి నిధులు ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎపి రైతు సంఘం ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ, నాయకులు శేఖర్ సిఐటియు కల్లూరు మండల కార్యదర్శి కె. మధు తదితరులు ఉన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ పాలకులకు శ్రద్ధ లేకపోవడం చేత కర్నూలు జిల్లా నిత్యం కరువు పీడిత ప్రాంతంగా ఉందన్నారు. వలసలు నివారించలేకపోతున్నారని పేర్కొన్నారు. గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్‌డిఎస్ కుడి కాలువ, మేలుగనూరు వరద కాలువ, వేదవతి ప్రాజెక్టు , హంద్రీనీవా విస్తరణ, చెరువులకు నీళ్ల నింపడం, పందికోన, క్రిష్ణగిరి రిజర్వాయర్లు నీళ్ల నింపి పంట కాలువలు ఏర్పాటు చేయడం, చెన్నరాయణ తిప్ప రిజర్వాయర్‌ను రెగ్యులర్‌గా నీళ్ల నింపి పంట కాలువలు ఏర్పాటు చేస్తే వలసలను పూర్తిగా నివారించవచ్చని సూచించారు. కరువును శాశ్వతంగా నివారించడానికి అవకాశం ఉందని మంత్రి నిమ్మల రామ నాయుడు దృష్టికి తెచ్చారు. కర్నూలు జిల్లా వర్షపాతం అత్యల్పంగా ఉంది కేవలం 670 మిల్లీమీటర్లు మాత్రమే వర్షం కురిసింది అన్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి అని ఆయన తెలిపారు. ఇప్పటికీ సాగు భూమి వర్షాధారం మీదనే సాగవుతుందని ఫలితంగా పంటలు పండవచ్చు లేదా ఎండిపోవచ్చని తెలిపారు. పంటలు లేక పండిన పంట కాస్త పూస్తో అయినా వాటికి ధర లేక పెట్టిన పెట్టుబడులు ఎల్లక రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడం కోసం తగిన ప్రణాళిక చేసుకొని త్వరితగతిన పూర్తిచేయాలని రైతు సంఘం ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. మంత్రిగారు సమాధానం ఇస్తూ గత ప్రభుత్వం అంతా లూటీ చేసిందని మా ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాజెక్టుల విషయం తప్పనిసరిగా ఆలోచిస్తామని తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

చిరు వ్యాపారులతో ఎమ్మెల్యే సమావేశం

ప్రజాశక్తి-పత్తికొండ

చిరు వ్యాపారస్తులందరూ పంచాయతీ అధికారులకు, పోలీసులకు సహకరించాలని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ కోరారు. పత్తికొండ పట్టణంలోని టిటిడి కళ్యాణమండపంలో పత్తికొండ మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి నరసింహులు ఆధ్వర్యంలో చిరు వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న చిరు వ్యాపారస్తులందరూ రైతుబజార్ సెంటర్‌కు వెళ్లి క్రయవిక్రయాలు జరుపుకోవాలని అన్నారు. రోడ్లపై తోపుడుబండ్లు, పూలపండ్లు కూరగాయలు వివిధ రకాల వ్యాపారాలు చేసుకునే వారంతా వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నారని అన్నారు. పోలీసులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతు బజారులో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సాంబశివారెడ్డి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, ప్రమోద్ రెడ్డి, సిఐ జయన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అకస్మాత్తుగా తలెత్తే ఆరోగ్య సమస్యలపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టికె. నాయక్ అన్నారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విదార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని గమనించాల్సింది గా ఆయన సూచించారు. డాక్టర్ ఎం. మనోజ్ కుమార్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో సిపిఆర్ చేసి రోగుల ప్రాణాలను ఏ విధంగా కాపాడాలో మోడల్స్ ఉపయోగించి ప్రాక్టికల్‌గా చూపించారు. విద్యార్థులు చాలాఆసక్తిగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటకృష్ణుడు (విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ , కర్నూలు రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి) శ్రీనివాస రెడ్డి (మెడికల్ ఆఫీసర్) సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య సివి.కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ ప్లీనరీకి హాజరైన సుధాకర్ బాబు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అహ్మదాబాద్ లో జరుగు జాతీయ కాంగ్రెస్ ప్లీనరీ సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ, మాజీ డిసిసి అధ్యక్షులు, ఎఐసిసి సభ్యులు ఎం సుధాకర్ బాబు హాజరయ్యారు.. ఈ సందర్భంగా సుధాకర్ బాబు కర్నూలు జిల్లా నుండి ప్రతినిధిగా పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ వివి రంగనాథ బాబు

ప్రజాశక్తి-సి బెళగల్

మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ వివి రంగనాథ బాబు బుధవారం ఎంపిడిఒ రానెమ్మ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఉన్న శ్యామల స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టి అధికారులతో సమీక్షించారు. మండల స్థాయి అధికారులపై ఎప్పటికప్పుడు విధుల పట్ల దృష్టి సారించి కీలకపరమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. విధుల్లో అలసత్వం చూపుతున్న అధికారులపై తమ దృష్టికి తెస్తే తగు చర్యలు చేపడతామని తెలిపారు.

గ్యాస్ ధరను తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి. గోవిందు, నాయకులు రాముడు, సురేష్, లక్ష్మీనరసయ్య డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా ముడిచమురు భారీగా తగ్గినా కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ. 50లు పెంచడం అన్యాయమని విమర్శించారు. క్రూడాయిల్ ధర తగ్గిన ప్రతిసారి కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీల పేరుతో ప్రజలపై పన్నుల భారం వేయడం సమంజసం కాదన్నారు. గ్యాస్ ధరలు పెరిగినా కేంద్ర ప్రభుత్వాన్ని కూటమి ప్రభుత్వం నిలదీయకపోవటం శోచనీయమన్నారు. తక్షణమే ధరల భారాన్ని ప్రజలపై తగ్గించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అబ్బులు, చేనేత కార్మిక సంఘం కార్యదర్శి కాంప్ప, సిపిఎం కార్యకర్తలు సుభాన్, బజారి, రాజు, తిమ్మయ్య, నావాల రాముడు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన


పొక్లెయినర్‌లో పనులు చేయిస్తున్న గ్రామ నాయకులు

గుమ్మనూరులో పారిశుద్ధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి-చిప్పగిరి

మండల పరిధిలోని గుమ్మనూరు గ్రామంలో బసప్ప స్వామి జాతర జరుగుతున్న నేపథ్యంలో బుధవారం గ్రామంలోని పురవీధులలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను సర్పంచి లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో చేయించారు. పంచాయతీ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ బసప్పస్వామి జాతర జరుగుతున్న సందర్భంగా జెసిబి ద్వారా అడ్డంగా ఉన్న ముళ్ళకంప చెట్లు తొలగించే కార్యక్రమం చేపట్టమన్నారు. డ్రెయినేజీ పనులు పూర్తి చేశామన్నారు. నీటి సమస్య ఎదురవకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సకాలంలో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. వీధులలో బ్లీచింగ్ పౌడర్‌ను వేయించామన్నారు. ఎమ్మెల్యే జయరాం తండ్రి బసప్ప, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, గ్రామ పెద్దలు అంపయ్య, గోవిందప్ప, శ్రీనివాసులు, పెద్దన్న, కిష్టప్ప, నల్లప్ప, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పండగలా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎస్‌సి, ఎస్‌టి, బిసిల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతిని ప్రతి ఒక్కరూ పండగల జరుపుకుందామని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పి) జిల్లా ఉపాధ్యక్షులు సాంబగల్లు బాలన్న పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదోని మండల పరిధిలోని సాంబగల్లు గ్రామంలో ఉదయం ఏడు గంటలకు ఎస్‌సి కాలనీలో ఘనంగా నిర్వహిస్తు న్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్‌పిఎస్ ఆదోని పట్టణ అధ్యక్షులు గుమ్మల బాలస్వామి, జిల్లా నాయకులు కల్లుబావి వీరేష్, మండల నాయకులు దిబ్బనకల్లు సద్దాంహుస్సేన్, మండల గౌరాధ్యక్షులు బైసిగేరి తిమ్మన్న పాల్గొంటున్నారని, ఎస్‌సిలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల వివరాల సేకరణ

ప్రజాశక్తి - మద్దికేర : కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని కర్నూలు జిల్లా విభిన్న ప్రతిభావంతుల (వికలాంగుల) పునరావాస కేంద్రం డిస్టిక్ డిజేబిలిటీ, రిహాబిలేషన్, సెంటర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. మద్దికేర ఎంఎంపిడి కార్యాలయంలో పునరావాస కేంద్రం వైద్యులు గంగాభవాని, సాయి పూజిత, మద్దిలేటి, దావీదు 60 మంది విభిన్న ప్రతిభావంతుల సదరన్ సర్టిఫికెట్లు, వారి వైకల్య తీవ్రతను పరిశీలించారు. సౌకర్యాల కల్పనపై వివరాలు సేకరించారు. అవసరమైన సామాగ్రి అందించేల ఉన్నతాధికారులకు నివేదించనునట్లు వైద్యులు తెలిపారు. కొండయ్య, వికలాంగులు కొట్టాల వెంకటేష్, లింగన్న పాల్గొన్నారు.



యువకులు క్రీడల్లో రాణించాలి

- విరుపాక్షి రెడ్డి, నాకేష్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం: యువకులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని వైఎస్ఆర్సిపి సీనియర్ నాయ కులు విరుపాక్షి రెడ్డి, బి. నాకేశ్ రెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని బదినేహాల్ గ్రామంలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామి జాతర రథోత్సవం సందర్భంగా 15 రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. దాదాపు 40 టీంలు పాల్గొనగా అంతిమంగా బదినేహాల్ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. రెండో విజేతగా బల్లకల్ జట్టు గెలుపొందింది. గెలుపు పొందిన వారికి బహుమతి అందజేశారు. బదినెహాల్ మొదటి విజేతకు విరుపాక్షి రెడ్డి తరపున రూ. 30వేల బహుమతి అందజేశారు. బల్లెకల్ జట్టుకు రెండో బహుమతి రూ.20వేలను బి.నాగేష్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో విరుపక్షి రెడ్డి, నాకేష్ రెడ్డి, సాయి రూథిక్ రెడ్డి, ప్రసన్న రెడ్డి, వినోద్ రెడ్డి, బదినెహాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థలంపై తప్పుడు ప్రచారం తగదు

ప్రజాశక్తి-ఆదోని

పట్టణంలోని కెకెబి ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న 50 సెంట్ల స్థలాన్ని అంబేద్కర్ భవనం కోసం ప్రభుత్వం గతంలో కేటాయించిందని ప్రస్తుతం భూమిని కాజేసే ప్రయత్నం సరికాదని అభ్యుదయ సేవా సంఘం నాయకులు ఖండించారు. బుధవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు కల్లుబోతుల రంగన్న, లక్ష్మీనారాయణ, చంద్రమోహన్, కుంకునూరు వీరేష్, నరసన్న, గంగాధర్ మాట్లాడారు. సర్వేనెంబర్ 559/ ఎలో 50 సెంట్లు స్థలాన్ని అప్పటి మున్సిపల్ కౌన్సిల్లో అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఆమోదించి కేటాయించిందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే ,మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ,దామోదర్ సంజీవయ్య బాబు జగ్జీవన్ రామ్ ల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను అందరికీ అందుబాటులో ఉంచి చిన్న లైబ్రరీ ఏర్పాటు చేశామన్నారు. కరాటే, యోగ, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలకు నేర్పిస్తూ శరీర దృఢత్వం కు ఉపయోగపడేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కొంతమంది అస్థలం పై దుష్ప్రచారం చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డ్ సంబంధించిన స్థలంలో దేవాలయాలు నిర్మిస్తున్నారని ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా కొందరు వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని వాపోయారు. స్థలంపై గతంలో కొంతమంది కోర్టులో కేసు వేసినప్పటినుండి పోరాడుతూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని స్పష్టం చేశారు. అస్థలం పై దుష్ప్రచారాలు చేస్తున్నారని మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో అభ్యుదయ దళిత సేవ సంఘం నాయకులు కోదండ, గంగప్ప, అశోక్, చరణ్, రామకృష్ణ వున్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉపాధి కూలీలకు ఏడు వారాల పెండింగ్ వేతనాలు తక్షణమే ఖాతాలోకి జమ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి టి.అయ్యప్ప డిమాండ్ చేశారు. బుధవారం మండలం పరిధిలో ఆరెకల్ గ్రామంలో ఉపాధి కూలీలతో వారు మాట్లాడారు. గ్రామంలో సుమారుగా 200 మంది కూలీలు ఉపాధిపనులకు వెళుతున్నారని, అయితే 7 నుండి 9 వారాలు వరకు వేతనాలు అందక పోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంచినీటి వసతి ,నీడకొరకు టెంట్లు ఏర్పాట్లు, మజ్జిగ పంపిణీ చేయడం లేదన్నారు. వీటితో పాటు గడ్డపారలు, చెలికలు, ముడి సరుకులు కూలీలకు ఇవ్వడం లేదుని, 10 గంటల తరువాత ఎండలు ఎక్కువ ఉండటం వల్ల వడ దెబ్బలు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఇన్ని కష్టాలు తట్టుకొని పనిచేస్తే రోజుకు రూ.200 కూడా వేతనం అందడం లేదని, నేల గట్టిగా ఉండటం కూడా మరొక కారణం వీటన్నిటివల్ల వలసలు ఆగడం లేదని అన్నారు. ఇప్పటికైనా కనీసం వేతనం రూ.307 కంటే తక్కువ కాకుండా వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 15 రోజులు కు ఒక సారి వేతనాలు చెల్లించాలి మౌలికవసతులు కల్పించాలన్నారు. ఉపాధి కూలీల సమస్యల పై ప్రజాప్రతినిధులు స్పందించాలని లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

పిజిఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ

- టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్. రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతులు స్వీకరించినట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో బుధవారం మాట్లాడారు. సమస్య పరిష్కార దిశగా గ్రామ, మండల స్థాయి అధికారులతో అనుసంధానం చేసి సత్వరమే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెవెన్యూ, మండల అభివృద్ధి కార్యాలయాల్లో ఉండే సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసు కున్నారు. అనంతరం వినతులు ఇచ్చిన వారికి సంబంధిత సమస్యపై వివరించి పరి ష్కారానికి కృషి చేస్తా నని హామీ ఇచ్చామని పేర్కొన్నారు.



మానవత్వం చాటుకున్న భీమా యూత్ సభ్యులు

- బాధితురాలికి రూ. 25 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ప్రకాష్ తల్లి తాయమ్మకు రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించి భీమా యూత్ సభ్యులు మానవత్వం చాటుకున్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని గిల్లెసూగూరు వద్ద తుంగభద్ర గ్రామానికి చెందిన ప్రకాష్ ద్విచక్ర వాహనం పై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలులో చికిత్స పొందుతున్న ఆయనకు ఆపన్న హస్తం అందించేందుకు తుంగభద్ర గ్రామంలోని భీమా యూత్ తుంగభద్ర సేవా సమితి సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం రాంపురం రెడ్డి సోదరుల సహాయ సహకారాలతో వైసిపి జిల్లా కార్యదర్శి శ్రీ పి మురళీ మోహన్ రెడ్డి చేతుల మీదుగా బాధితుని తల్లి తాయమ్మకు రూ. 25వేలను బుధవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆపద సమయంలో ఆదుకున్న తుంగభద్ర సేవా సమితి సభ్యులకు తాయమ్మ కృతజ్ఞతలు తెలిపారు. సిద్ధారెడ్డి, భీసన్న, ఆంజనేయులు, మెహబూబ్, షఫీ, నర్సన్న, హనుమంతు పాల్గొన్నారు.



పౌర సరఫరాల గోడౌన్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని పట్టణంలో పౌర సరఫరాల గొదం పాయింటను బుధవారం ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. గొదంలో ఉన్న రేషన్ నిల్వ, రికార్డ్స్, భద్రత అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం కార్డ్ లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సబ్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దారు రవీంద్ర రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ అకౌంట్స్ షకీలా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అత్యవసర మున్సిపల్ కౌన్సిల్

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావించి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ఈనెల 10న గురువారం అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఉంటుందని కమిషనర్ కృష్ణ బుధవారం తెలిపారు. తాగునీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు, కూరగాయల మార్కెట్ వేలం నిర్వహణ, సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి నిధుల మంజూరుకు కౌన్సిల్లో తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు. సభ్యులందరూ 11 గంటల్లోగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

హనుమాన్ శోభయాత్రను.. శాంతి యుతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుందలో ఈ నెల 12న బాల ఆంజనేయస్వామి దేవాలయం నుండి బయలు దేరే హనుమాన్ శోభ యాత్రను శాంతి యుతంగా జరుపుకోవాలని పత్తికొండ డిఎస్‌పి వెంకట రామయ్య, ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భారద్వాజ్ హాజరై ముస్లిము, హిందూ మతపెద్దలతో మాట్లాడారు. పండగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అసత్య ప్రచారం చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహశీల్దార్ నిజాముద్దీన్, ఎంపిడిఒ విజయ లలితా, ఎస్ఐ దిలీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.



గిన్నీస్ బుక్‌లోకి మెప్మా

ప్రజాశక్తి - ఆదోని

మెప్మా సేవలు మరింత విస్తరిం చాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ శివ లీల పేర్కొన్నారు. ఆదోనిలో మెప్మా సేవల పోస్టర్‌ను ఆమె బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని మార్చి 8న ఒక్క రోజులో స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన ప్రొడక్ట్స్ ఓబ్యాగ్, టవల్స్ 1.35లక్షల వరకు కొనుగోలు కావడంతో మెప్మాకు గిన్నీస్ బుక్‌లో చోటు దక్కింది. ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ ఆర్పీల ప్రోత్సాహంతో స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఎంఎం జెలాన్ బాష, సిఒలు జవీద్, కృష్ణవేణి, అరుణ, నారాయణమ్మ, అంజని దేవి, ఆర్‌పిలు పాల్గొన్నారు.


అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏప్రిల్ 14న ఎమ్మిగనూరు పట్టణంలో మండల తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో తల సేమియా బాధితుల పిల్లల ప్రాణాలు కాపాడేందుకు తమవంతుగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు కదిరికోట ఆదెన్న, జి. ఆనంద్ చైతన్య మాదిగలు తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆమోదించి 75 ఏళ్ళు నిండిన సందర్భంగా వేలాది మందితో ఏప్రిల్ 14న రాజ్యాంగం వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తూ పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. మానవత్వంతో రక్తదానం చేయదలచిన వారు రక్తదాన శిబిరం కోఆర్డినేటర్ దేవెబెట్ట హనుమంతు సెల్ :9701010198 కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఉపాధ్యాయులు పి. మాదన్న ఆధ్వర్యంలో... రాజ్యాంగం-అంబేద్కర్ ల పై వ్యాసరచన పోటీలు, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు , టాలెంటును ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. వేడుకలకు ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీలు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున హాజరై సేవా కార్యక్రమాలలో పాలు పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రోజా ఆర్ట్స్ ఉసేని, రక్తదాన శిబిరం కోఆర్డినేటర్ దేవెబెట్ట హనుమంతు, దళిత నాయకులు గుడికల్ స్వామి దాసు, కోటేకల్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించండి

ప్రజాశక్తి-ఆదోని



మున్సిపాల్టీ పరిధిలోని పుర వాసులు ముందస్తుగా ఆస్తి, నీటి పన్ను చెల్లించి 5శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల 267 ప్రకారం. ఈనెల 4 మేరకు 2025-26 వ సంవత్సరపు ఆస్తి పన్ను మొత్తం ముందస్తుగా ఏకమొత్తంలో చెల్లింపు పై 5 శాతం పన్ను రాయితీ తో తేది: ఈనెల 30వరకు చెల్లించవచ్చున్నారు. డిమాండ్ నోటిస్ అందక పోయిరా ఇంటి నెంబర్ లేదా అసెస్మెంట్ నెంబర్‌తో కార్యాలయపు కౌంటర్‌లో, సమీప వార్డ్ సచివాలయం లో సంప్రదించి లేదా ఆన్‌లైన్‌ద్వారా ద్వారా ఈనెల30వ తేదీలోగా ప్రస్తుత సంవత్సరపు ఆస్తి పన్ను మొత్తం ఏకమొత్తం లో చెల్లించి 5శాతం పన్ను రాయితీ పొంది డబ్బు ఆదా చేసుకోవాలన్నారు.

పిసిఒడి సమస్యకు హోమియోపతిలో శాశ్వత పరిష్కారం

డాక్టర్ మాధురి సూచనలు- సలహాలు -పరిష్కారమార్గాలు- నేడు వరల్డ్ హోమియోపతి డే

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

స్త్రీలలో సంతానోత్పత్తికి అవసరమైన అవయవాలలో అతి ముఖ్యమైనవి అండాశయాలు. ఇవి గర్భసంచికి ఇరువైపుల ఉంటాయి . ఇ అండాశయాలు ప్రతినెల సుమారు 5 నుంచి 20 వరకు అండాలను ఉత్పత్తి చేస్తాయి. ఈ అండలు పాలిక్యూట్స్ అనే చిన్న చిన్న సంచులలో ఉండే నీటి మాదిరి ద్రవంలో కేంద్రీకృతమై ఉంటాయి . వీటికి కేవలం ఒకే అండం మాత్రమే అభివృద్ధి చెంది అండం విడుదల సమయంలో ఈ పాలిక్యుట్స్ నుంచి పాలోపియన్ ట్యూబ్ల ద్వారా ఫలదీకరణకి లబ్దమవుతుంది. ప్రతిఏడాది ఏఫ్రిల్ 10వన ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని జరుపుకుంటారు. హోమియోపతి వ్యవస్థాపకుడు జర్మనీ దేశానికి చెందిన డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానిమాన్ 1755 ఏప్రిల్ 10న జన్మించారు. ఈ రోజును ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పిసిఒడి సమస్యపై డాక్టర్ మాధురి సూచనలు సలహాలు ఆమె మాటల్లో.....

పిసిఒడి అంటే?: పిసిఒడితో బాధపడుతున్న స్త్రీలలో అండం అభివృద్ధికి అవసరమైన అన్ని హార్మోన్లను అండాశయం ఉత్పత్తికి చేయకపోవడం వల్ల ఏ ఒక్క అండంలో పూర్తిస్థాయి ఎదుగుదల ఉండదు. ఇటువంటి అండాలను సిస్ట అని అంటాం. ఈ సిస్ట నుంచి ఆండ్రోజన్ , టెస్టోస్టోరాన్ అనే పురుష హార్మోన్ ఎక్కువ మోతాదులో ఉత్పత్తి కావడం వల్ల అండం విడుదల జరగకపోవడంతో పాటు ప్రొజెస్టరాన్ హార్మోన్ శాతం తగ్గి రుతు సమస్యలు మొదలవుతుంది. 50 శాతం మంది స్త్రీలలో పిసిఒడి అనేది వంశపారంగా జన్యుపరమైన కారణాలవల్ల వస్తుందని శాస్త్రీయ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. అంతేకాకుండా శరీర, జీవన ప్రక్రియకు అవసరమయ్యే ఇన్సులిన్ హార్మోన్ పనితీరు మెరుగ్గా లేకపోవడం వల్ల ఈ రకంలో దీని మోతాదు అవసరానికి మించి పెరగకపోవడం వల్ల సంతానోత్పత్తికి అవసరమయ్యే ఎల్‌హెచ్‌ఎఫ్ఎస్ హెచ్ వంటి హార్మోన్లపైన దుష్ప్రభావం చూపుతుంది. అండం విడుదల ప్రక్రియను నిలువరించే టెస్టోస్టోరాన్ ఆండ్రోజన్ లాంటి హార్మోన్ల శాతం పెరిగి కరెక్ట్ రకరకాల దుష్పరిమానాలకు దారితీస్తుంది. అయితే ఏ ఇద్దరి స్త్రీలలో ఒక రకమైన కారణం చేత పిసిఒడి ఏర్పడదు.


డాక్టర్ మాధురి


డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్, ఎండి (హోమియోపతి)
ఇంటర్నేషనల్ క్లాసిక్ హోమియోపతి, కర్నూలు

ఈ లక్షణాలతో జాగ్రత్త: నెలసరి మొదలయ్యే వయసు నుంచి మోనోపాజ్ వరకు పిసిఒడి లక్షణాలు ఎప్పుడైనా కనిపించే అవకాశం లేకపోలేదు. కానీ వయసులో పెరిగిన కొద్దీ లక్షణాలు తగ్గుముఖం పట్టిన దాని దుష్పరిణామాలు డయాబెటిస్, ఒబిసిటీ వంటివి జీవితాంతం ఇబ్బందికి గురి చేస్తుంటయి. పిసిఒడి ప్రారంభంలో నెలసరి పూర్తిగా లేకపోవడం. సరైన క్రమంలో రాకపోవడం లేదా ఎక్కువగా అవ్వడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆండ్రోజన్ హార్మోన్ శాతం పెరగడం వల్ల తలపై జుట్టు రాలిపోవడంతో పాటు ముఖం, ఛాతి, వీపు భాగాలలో అవాంచిత రోమాయలు పెరగడం జరుగుతుంది. జిడ్డు చర్మం మొటిమలు రావడం డిప్రెషన్ ఆందోళన లోనవ్వడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆ తర్వాత బరువు పెరగడం, జుట్టు పల్చబడడం, గర్భస్రావం కావడం, సంతానలేమి, అధిక రక్తపోటు, గురుక తో పాటు ఆయాసం, కొలెస్ట్రాల్ శాతం పెరగడం, చర్మం నెలసరిగా తయారయ్యి పిగ్మెంటేషన్‌కు లోనవుతారు.

నిర్ధారణ: వ్యాధి లక్షణాలను పరిశీలించడం, కొన్ని రకాల పరీక్ష చయడం ద్వారా పిసిఒడిని నిర్ధారించుకోవచ్చు. ఎఫ్ ఎస్ హెచ్, ఎల్ హెచ్ హార్మోనల్ లెవెల్, సాధారణంగా ఎఫ్ ఎస్ హెచ్, ఎల్ హెచ్ రేషియో ఎల్లప్పుడూ రెండు కన్నా తక్కువ ఉండాలి.పిసిఒడి ఉన్నవరిలో నాలుగు లేదా అంతకన్నా ఎక్కువగా ఉంటుంది. దీని ఆధారంగా పిసి వాడిని నిర్ధారించవచ్చు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చు పిసిఒడితో బాధపడే ప్రతి ఒక్కరిలో సంతానలేమి ఉంటుందని కేవలం అపోహ మాత్రమే. కొంతమంది స్త్రీలలో పిసిఒడి ఉన్న సంతానం కలుగుతుంది. అందువల్ల సంతానలేని అనేది పిసిఒడి లక్షణాల్లో ఒకటిగా మాత్రమే పేర్కొనవచ్చు.

హోమియో చికిత్స: పిసిఒడి సమస్యకు హోమియో వైద్య విధానంలో చక్కని పరిష్కారం అందుబాటులో ఉంది. అంతేకాకుండా వ్యాధితో వచ్చే అనుబంధ సమస్యలైన డయాబెటిస్, ఒబిసిటీ, అధిక రక్తపోటు, సంతానలేమి, పిగ్మెంటేషన్, జుట్టు రాలిపోవడం వంటి వాటిని తగ్గించడం సాధ్యమవుతుంది. నిపుణులైన హోమియో వైద్యులు పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే ఈ సమస్యపూర్తిగా తగ్గిపోతుంది.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.756/2022

వై.బి.రామచంద్ర. ...వాది
-వర్సెస్-
యం.శ్రీనివాసరెడ్డి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

యం.శ్రీనివాసరెడ్డి తండ్రి యం.మాణిక్యంరెడ్డి, వ్యాపారం,వ్యవసాయం,యం.పి.పి.స్కూల్ ఎదురుగా, నివాసం.వర్కూరు గ్రామం మరియు కోడుమూరు మండలం, కర్నూలు జిల్లా

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తంరూ.11,23,333/-లు అసలు వడ్డీ కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ పై కోర్టులో దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 9-5-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపు కొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 9-5-2025

జి. ఐ.హమీద్,
ఎ. సత్యనారాయణ,
వాది పరం అడ్వకేట్లు
కర్నూలు. పత్తికొండ
సెల్.నెం. 9440832315

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
ఇ.పి.నెం.58/2019 ఇన్ యల్.ఎ.ఓ.పి.నెం.3/2013

విజయలక్ష్మి. ...డి. హెచ్. ఆర్
-వర్సెస్-
రెవిన్యూ డివిజన్ ఆఫీసర్(యల్.ఎ) కర్నూలు. ...జె.డి.అర్

వేలం ప్రకటన

పై నెంబరు ఇ.పిలో డి.హెచ్.ఆర్ తన యొక్క ఇ.పి మొత్తం రాబట్టుకొనుటకు జె.డి.ఆర్ తాలుకు ఇ.పి.షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలమునకు తెచ్చినాడు. వేలం వాయిదా 25-4-2025 వతేదిన ఉదయం 10.30 గంటలకు కలదు.సవాలుదారులు పై కోర్టులో హజరై సవాలులో పాల్గోనవచ్చును.

షెడ్యూలు: కర్నూలుజిల్లా, కర్నూలు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్‌లో చేరిన బి.క్యాంపులోని ఆస్తి

వివరములు : ఇంటి.నెం.బి/బి-19,బి.క్యాంపు, కర్నూలు.
తూర్పు : ఇంటి.నెం.బి/సి-5.
పడమర : దేవాలయం.
ఉత్తరం : ఇంటి.నెం.బి/బి-18.
దక్షిణం : ఇంటి.నెం.బి/బి-20.
తూర్పు-పడమర :43.10 స్క్వేర్‌ఫీట్స్.
ఉత్తరం-దక్షిణం :19.8 స్క్వేర్‌ఫీట్స్.
మొత్తం విస్తీర్ణం: 853.8 చదరపు అడుగులు.
డి.హెచ్.ఆర్ విలువ :రూ.16,28,000/-లు
అమీనా విలువ : రూ.20,00,000/-లు
సబ్ రిజిష్టర్ విలువ :10,00,000/-లు

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా :25-4-2025

ఎ.రామసుబ్బారెడ్డి,
డి. హెచ్.ఆర్ పరం అడ్వకేటు, కర్నూలు

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
ఇ.పి.నెం.57/2019
ఇన్ యల్.ఎ.ఓ.పి.నెం.2/2013

సేగు అంజనేయులు. ...డి. హెచ్. ఆర్
-వర్సెస్-
రెవిన్యూ డివిజన్ ఆఫీసర్(యల్.ఎ) కర్నూలు. ...జె.డి.అర్

వేలం ప్రకటన

పై నెంబరు ఇ.పిలో డి.హెచ్.ఆర్ తన యొక్క ఇ.పి మొత్తం రాబట్టుకొనుటకు జె.డి.ఆర్ తాలుకు ఇ.పి.షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలమునకు తెచ్చినాడు. వేలం వాయిదా 25-4-2025 వతేదిన ఉదయం 10.30 గంటలకు కలదు. సవాలుదారులు పైకోర్టులో హజరై సవాలులో పాల్గోనవచ్చును.

షెడ్యూలు: కర్నూలు జిల్లా, కర్నూలు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్‌లో చేరిన బి.క్యాంపులోని ఆస్తి

వివరములు : ఇంటి.నెం.బి/సి-6, బి.క్యాంపు, కర్నూలు.
తూర్పు : రోడ్డు.
పడమర : ఇంటి.నెం.బి/బి-20.
ఉత్తరం : ఇంటి.నెం.బి/బి-5.
దక్షిణం : దేవస్థానం రోడ్డు.
తూర్పు-పడమర :43.10 స్క్వేర్‌ఫీట్స్.
ఉత్తరం-దక్షిణం :19.8స్క్వేర్‌ఫీట్స్.
మొత్తం విస్తీర్ణం: 853.38 చదరపు అడుగులు.
డి.హెచ్.ఆర్ విలువ :రూ.18,20,000/-లు
అమీనా విలువ : రూ.20,00,000/-లు
సబ్ రిజిష్టర్ విలువ :10,00,000/-లు

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 25-4-2025

ఎ.రామసుబ్బారెడ్డి,
డి. హెచ్.ఆర్ పరం అడ్వకేటు,
కర్నూలు

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
ఇ.పి.నెం.60/2019
ఇన్ యల్.ఎ.ఓ.పి.నెం.5/2013

పి. చిన్న సుబ్బారావు. ...డి. హెచ్. ఆర్
-వర్సెస్-
రెవిన్యూ డివిజన్ ఆఫీసర్(యల్.ఎ) కర్నూలు ...జె.డి.అర్

వేలం ప్రకటన

పై నెంబరు ఇ.పిలో డి.హెచ్.ఆర్ తన యొక్క ఇ.పి మొత్తం రాబట్టుకొనుటకు జె.డి.ఆర్ తాలుకు ఇ.పి.షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలమునకు తెచ్చినాడు. వేలం వాయిదా 25-4-2025 వ తేదిన ఉదయం 10.30 గంటలకు కలదు. సవాలుదారులు పై కోర్టులో హజరై సవాలులో పాల్గోనవచ్చును.

షెడ్యూలు: కర్నూలు జిల్లా, కర్నూలు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్‌లో చేరిన బి.క్యాంపులోని ఆస్తి

వివరములు: ఇంటి.నెం.బి/బి-18,బి.క్యాంపు, కర్నూలు.
తూర్పు : ఖాళీ స్థలము.
పడమర : దేవాలయం.
ఉత్తరం : ఇంటి.నెం.బి/బి-17.
దక్షిణం : ఇంటి.నెం.బి/బి-19.
తూర్పు-పడమర :43.10 స్క్వేర్‌ఫీట్స్.
ఉత్తరం-దక్షిణం :19.8 స్క్వేర్‌ఫీట్స్.
మొత్తం విస్తీర్ణం: 853.38 చదరపు అడుగులు.
డి.హెచ్.ఆర్ విలువ :రూ.14,36,000/-లు
అమీనా విలువ : రూ.20,00,000/-లు
సబ్ రిజిష్టర్ విలువ :10,00,000/-లు

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా :25-4-2025

ఎ.రామసుబ్బారెడ్డి,
డి. హెచ్.ఆర్ పరం అడ్వకేటు,
కర్నూలు